# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 28 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## శ్రీలంకలో భారీ వర్షాలు.. 35 మంది మృతి

**బలగం టీవి, కొలంబో**

వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో శ్రీలంక అతలాకుతలమైంది. కొండచరియలు విరిగిపడటంతో పాటు వరదలు ముంచెత్తడంతో సుమారు 35 మందికి పైగా మరణించినట్టు అధికారులు గురువారం ప్రకటించారు. గతవారం నుండికురుస్తున్న వర్షాలతో మృతుల సంఖ్య 31కి చేరింది. కొలంబోకు తూర్పున 300 కి.మీ దూరంలో ఉన్న మధ్యప్రావిన్స్‌లోని పర్వతప్రాంతాలైన బదుల్లా, నువారా ఎలియాలో అత్యధిక మరణాలు సంభవించిందని ప్రభుత్వ విపత్తు నిర్వహణ కేంద్రం గురువారం తెలిపింది. ఇవే ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో మరో 14మందికి పైగా గల్లంతైనట్టు వెల్లడించింది. వారాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఇండ్లు, పొలాలు, రహదారులను వరదలు ముంచెత్తాయి. పర్వతప్రాంతాలను రాళ్లు, బురద మరియు చెట్లు పట్టాలపై పడటంతో రైల్వే వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమైంది. పలు ప్రాంతాల్లో ప్యాసింజర్ రైళ్లను నిలిపివేశామని అధికారులు తెలిపారు. మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లను కూడా మూసివేశామని ప్రకటించారు. వర్షాలు, ప్రతికూల వాతావరణంతో సుమారు 4,000 కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు విపత్తు నిర్వహణ కేంద్రం ప్రకటించింది.

### రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని

# 3 రీజియన్లుగా విభజించాలి

- అభివృద్ధి చేయాలి
- విజన్ 2047 సిద్ధం
- 22 ఏళ్ల కార్యాచరణ ప్రణాళిక
- తెలంగాణకు కొత్త రింగ్ రోడ్లు, కారిడార్లు, ఎయిర్‌పోర్టులు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- గ్లోబల్ సమ్మిట్ 2025 పై ముఖ్యమంత్రి సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్‌మ్యాప్, పాలసీ డాక్యుమెంట్ కనిపించాలని చెప్పారు.రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. కోర్-అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీగా మూడు ప్రాంతాలుగా విభజించుకోవాలని సూచించారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా విజన్ 2047కు సిద్ధమౌతోంది. అందరికీ సమాన అవకాశాలు, సమీకృత అభివృద్దే టార్గెట్‌గా రానున్న 22 ఏండ్ల కార్యాచరణను డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో ప్రభుత్వం ఆవిష్కరించబోతోంది. ఈ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 2025) పై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ధనసరి అనసూయ సీతక్క, మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశంలో పాలసీ డాక్యుమెంట్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్నఅపారమైన అవకాశా లను ప్రపంచ పెట్టుబడిదారుల ముందు ఆవిష్కరించడంతో పాటు ఇక్కడ పెట్టుబడులు పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను ఈ రెండు రోజుల్లో సదస్సులో ప్రభుత్వం ప్రధానంగా వివరిస్తుంది.హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి సమతుల్యత సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేసమయంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్‌లో భాగమవుతుంది.


ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, స్టార్టప్, MSMEలు, టూరిజం, ఎగుమతులు వంటి రంగాల్లో రానున్న రెండు దశాబ్దాల్లో ఆర్థిక వృద్ధికి కీలకమవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. బ్లూ అండ్ గ్రీన్ హైదరాబాద్ లక్ష్యంగా తెలంగాణ 2047 డాక్యుమెంట్‌లో మూసీ పునరుజ్జీవం, దీనిలో భాగంగా 2959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను వాటి పూర్వ స్థితికి తీసుకురావటం లక్ష్యంగా పెట్టుకుంది.ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో తెలంగాణకు మణిహారంలా రీజనల్ రింగ్ రోడ్డు, హై-స్పీడ్ మొబిలిటీ కారిడార్లు, రీజనల్ రింగ్ రైల్, 4 ఇండస్ట్రియల్ కారిడార్లు, 11 రేడియల్ రోడ్లను నిర్మించనుంది. వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతోంది.

ప్రతీ ఏడాది రెండు లక్షల యువతకు, లక్షమంది నిపుణులకు విదేశీ ఉపాధికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి టార్గెట్‌గా ప్రణాళికల రూపకల్పన, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా స్పోర్ట్స్ విలేజీల నిర్మాణం, మానసిక ఆరోగ్యం, యోగా, ధ్యానం, క్రీడలు, సాంస్కృతిక అవగాహనతో సమతుల్య యువత అభివృద్ధి కోసం హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు అంశాల్లో స్పష్టమైన భవిష్యతు ప్రణాళికలు రూపొందించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించటమే లక్ష్యంగా టూరిజం ప్రాంతాల అభివృద్ధి, నైట్ ఎకానమీ సిటీగా హైదరాబాద్ ఇమేజ్ ను క్రియేట్ చేయటం, బతుకమ్మ, బోనాలు, డెక్కన్ క్రాఫ్ట్ గ్లోబల్ పండుగలతో బ్రాండ్ తెలంగాణను విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పించారు. ప్రపంచ సినిమా రంగాన్ని ఆకర్షిస్తూ యానిమేషన్, గేమింగ్, ఫిలిం-టెక్ పరిశ్రమలకు తెలంగాణ కొత్త గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామంతో పాటు గ్లోబల్ సిటీ హైదరాబాద్ వరకు సమాన అవకాశాలు, స్థిరమైన అభివృద్ధి అనే లక్ష్యంతో ఈ తెలంగాణ విజన్ డాక్యుమెంట్ -2047 మార్గదర్శకంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.

## హైదరాబాద్‌లో స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోడీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



శంషాబాద్‌లో స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. తొలి ప్రయివేటు కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశంలోనే అతిపెద్ద ప్రయివేటు రాకెట్ ఫ్యాక్టరీ కావడం విశేషం. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. స్కైరూట్ బృందానికి అభినందనలు తెలిపారు. అంతరిక్షంలో ఇది ఒక గొప్ప మైలురాయి అని పేర్కొన్నారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని తెలిపారు. "ఈ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుంది. సైకిల్‌పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి మన ప్రస్థానం ప్రారంభమైంది. వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలి. స్పేస్ సెక్టార్‌లో కో ఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చాం. జన్‌జీ అనుకున్నది సాధించేలా ప్రభుత్వం సహకరిస్తుంది. అంతరిక్ష రంగంలో కేంద్రం ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయి. ప్రయివేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయి. జన్‌జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్స్, సైంటిస్టులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి" అని మోడీ తెలిపారు.

## రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించాలి




- 9వ షెడ్యూల్‌లో చేర్చేలా రాజ్యాంగ సవరణ జరగాలి
- ప్రధాని సమయమిస్తే సీఎం నాయకత్వంలో ఢిల్లీకి వస్తాం
- ఎంపీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమయమిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బీసీలకు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. తొమ్మిదో షెడ్యూల్ చేర్చేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని చెప్పారు. తెలంగాణకు చెందిన ఎంపీలు పార్లమెంటు సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చకు తేవాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎంపీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఎంపీల సమావేశం ఏర్పాటు చేశామన్నారు. బీసీల రిజర్వేషన్ అంశంపై పార్లమెంటు సమావేశాల్లో నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదంటే ప్రశ్నోత్తరాల్లో చర్చకు తేవాలని కోరారు. ప్రధానమంత్రిని కలిసి అన్ని పార్టీల ఎంపీలూ వినతి పత్రాన్ని ఇవ్వాలని సూచించారు. బీసీల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందనీ, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని చెప్పారు. ఆ బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని వివరించారు.

రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా ఎంపీలందరూ పార్టీలకతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారని అన్నారు. ఎంపీలు అడిగిన సమాచారం నిమిషాల్లో లేదా గంటల్లో అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామనీ, దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జీఎస్టీ తదితర విషయాలకు సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పథకాలకు గురించి గతంలో లేఖలు రాశామని గుర్తు చేశారు. అవి ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపీలకు అందుబాటులో ఉంటాయనీ, వాటి ఆధారంగా ఎంపీలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

వచ్చేనెల తొమ్మిదో తేదీ నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తవుతున్న సందర్భంగా సాధించిన విజయాలు, రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి విజన్ డాక్యుమెంట్-2047 ఆవిష్కరించబో తున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖులను దిగ్గజ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని వివరించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధనకు అవసరమైన వనరులు, ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నామనీ, కేంద్ర మంత్రులు, ఎంపీలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న ఎంపీలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపీలు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇస్తే వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని చెప్పారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖల ద్వారా 47 అంశాలను గుర్తించామని అన్నారు. సెమీ కండక్టర్లకు సంబంధించిన అంశం కూడా చర్చించామన్నారు.

# నామినేషన్లు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు 3,242, 37,440 వార్డులకు కేవలం 1,821 నామినేషన్లు దాఖలయ్యాయి. 318 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నల్లగొండలో అత్యధికంగా 421 నామినేషన్లు వచ్చాయి. 48 స్థానాలున్న ములుగు జిల్లాలో అత్యల్పంగా 22 నామినేషన్లు వచ్చాయి. 1,246 వార్డుమెంబర్లకు గాను సంగారెడ్డిలో అత్యధికంగా 149, మెదక్, కొమురం భీం ఆసీఫాబాద్ జిల్లాల్లో 4 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్ర, శనివారాల్లో పెద్ద ఎత్తున ఆశావహులు క్యూ కడతారని భావిస్తున్నారు.

పంచాయతీల ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్ ఛైర్మెన్‌గా జనరల్ అడ్మినిస్ట్రేషన్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు సక్రమంగా జరిగేలా ఈ కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టనుంది.

**కోర్టుల్లో వరుస పిటిషన్లు.. లీగల్ సెల్ ఏర్పాటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్లు, ఇతర ఎన్నికల వ్యవహారాలపై కోర్టుల్లో వరుస పిటిషన్లు దాఖలవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం లీగల్ సెల్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు గురువారం పంచాయ తీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన సర్క్యులర్ జారీ చేశారు. ముగ్గురు సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఈ సెల్‌కు నియమించారు. లీగల్ సెల్‌లో కిషన్ సింగ్, మాధురి లత, క్రాంతి కిరణ్‌లు సూపరిండెంట్‌లుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. కోర్టుల్లో కొత్తగా దాఖలయ్యే కేసులకు జిల్లా స్థాయి అధికారులు 24 గంటల్లోగా ప్రభుత్వ తరపు న్యాయవాదులకు వివరాలు పంపాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడానికి, కోర్టు కేసులు ఎన్నికలను ప్రభావితం చేయకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక సెల్ జిల్లాలన్నింటితో సమన్వయం చేస్తుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది.

### బలవంతంగా ఏకగ్రీవం కుదరదు

సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల్లో బలవంతపు ఏకగ్రీవాలు జరిగితే ఆ ఎన్నికను నిలిపి వేయాలని జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరంద సర్క్యులర్ జారీ చేశారు. వేలం ద్వారా, బలవంతంగా సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు జరిగే ఏకగ్రీవాలపై అధికారులకు ఎన్నికల కమిషన్ కీలక సూచనలు చేసింది. ఎన్నికల్లో వేలంపై ప్రత్యేక పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు మకరంద తెలిపారు. ఏదైనా గ్రామంలో బలవంతంగా నామినేషన్లను ఉపసంహరిస్తు న్నారని ఫిర్యాదులు అందినప్పుడు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలని డీఈవోకు సూచించారు.



## డీజీపీ కార్యాలయం వద్ద అయ్యప్ప స్వాముల ఆందోళన

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయం ఎదుట గురువారం ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్రం నలుమూలలకు చెందిన అయ్యప్ప స్వాములు భారీ ర్యాలీగా వచ్చి డీజీపీ ఆఫీసును ముట్టడించడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. అయ్యప్ప మాలతో పోలీస్ కార్యాలయంలోకి రాకూడదని జారీ చేసిన మెమోకు వ్యతిరేకంగా స్వాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజీపీ కార్యాలయంలోకి ప్రవేశించేందుకు స్వాములు ప్రయత్నించగా, వారిని అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య తోపులాట జరగడం, స్వాములపై పోలీసులు లాఠీచార్జ్ చేసినట్లు వారు ఆరోపించారు. పోలీసుల చర్యలకు స్వాములు తీవ్ర నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కొంతమంది అయ్యప్ప స్వాములను అరెస్టు చేశారు. డీజీపీ కార్యాలయం వద్ద కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

అయ్యప్ప దీక్షలో ఉన్నవారికి పోలీస్ డ్రెస్ కోడ్ నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలి అనే డిమాండ్‌తో స్వాములు ముందుకు వచ్చారు. పోలీస్ వ్యవస్థలో విధులు నిర్వహించే అయ్యప్ప భక్తులు మాలలు ధరించలేరన్న ఆదేశంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ ఘటనతో డీజీపీ కార్యాలయం పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించగా, పరిస్థితులు క్రమంగా సామాన్య స్థితికి చేరుకున్నాయి.

## సర్పంచ్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గలేదు

- మంత్రి సీతక్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సర్పంచ్ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు ఎక్కడా తగ్గలేదని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్‌ల రిజర్వేషన్లకు మండల యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు గ్రామపంచాయతీ యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని ఖరారు చేశామని పేర్కొన్నారు. సుప్రీం మార్గదర్శకాలననుస రించి 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. కొన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉండటంతో ఆ పరిమితిని దాటి పోకుండా ఉండేందుకు బీసీ రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగినట్టు చెప్పారు. సర్పంచుల రిజర్వేషన్లకు మండ లాన్ని, వార్డు సభ్యులకు గ్రామాన్ని, జడ్పీటీసీ లకు జిల్లాను, జడ్పీ చైర్మెన్లకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకున్నామని వివరించారు. భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్ల కేటాయింపు జరిగిందనీ, ఇది రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆమె స్పష్టం చేశారు. కొత్తగా ఏర్పడిన తండాలు, గూడేంలు గ్రామ పంచాయతీలుగా మారడంతో గిరిజన సీట్ల సంఖ్య సహజంగా పెరిగిందని తెలిపారు.

సర్పంచ్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కేటాయింపుపై కేటీఆర్ తప్పుడు ప్రచారం మానుకోవాలని సీతక్క హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించిన పాపం బీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిందనీ, అయితే 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి బీసీల గొంతు కోసిందని ఆరోపించారు. వాస్తవాలు ఇలా ఉంటే బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందని కేటీఆర్ విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసిందని గుర్తు చేశారు. 2019 స్థానిక ఎన్నికల్లో రాష్ట్రం యూనిట్‌గా సర్పంచుల రిజర్వేషన్లను బీఆర్ఎస్ ఖరారు చేయగా, ఆ విధానాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కుల గణనను అడ్డుకుంది ఎవరు? రిజర్వేషన్లపై అడ్డంకులు సృష్టించింది ఎవరు? అన్న ప్రశ్నలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. ప్రభుత్వపరంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటం చేస్తూనే, పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో వారికి 42 శాతం సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం సీట్ల కేటాయింపుపై బీఆర్ఎస్ స్పష్టత ఇవ్వాలని సవాల్ విసిరారు.

## రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా పని చేస్తున్న రేవంత్ రెడ్డి

- ప్రజా ఆస్తులైన 9300 ఎకరాల పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర.
- బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా కాకుండా కేవలం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అక్రమాలపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి హిల్ట్ పాలసీ పేరుతో మరో భారీ కుంభకోణానికి తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. మొదట మూసీ భూములు, ఆ తర్వాత రీజినల్ రింగ్ రోడ్డు, సెంట్రల్ యూనివర్సిటీ భూములపై పడ్డ రేవంత్ దృష్టి%ొ% ఇప్పుడు హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను దోచుకోవడంపై పడిందని విమర్శించారు. ఒకప్పుడు ప్రజల కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి పారిశ్రామికవేత్తలు చవకగా భూములు తీసుకు న్నారని, ఇప్పుడు ఆ భూముల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు కట్టుకునేందుకు రేవంత్ రెడ్డి అతి తక్కువ ధరకే అనుమతులు ఇస్తూ రియల్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.దాదాపు 9300 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తూ, ఐదారు వందల మంది కోసం 5 లక్షల కోట్ల రాష్ట్ర ప్రజల ఆస్తిని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో సగం డబ్బులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయని, ఎవరి అబ్బ సొత్తని ఈ భూములను ధారాదత్తం చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రైవేట్ వ్యక్తులకు భూములను అప్పజెప్పే ఈ పాలసీని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మోసం చేసిందని కేటీఆర్ దుయ్యబట్టారు. గత ప్రభుత్వం 24 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 17 శాతం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్ పార్టీకి బీసీ సోదరులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

**పాలమూరుకు రేవంత్ చేసింది శూన్యం**


ఉమ్మడి పాలమూరు జిల్లాలో కేసీఆర్ హయాంలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని కేటీఆర్ గుర్తుచేశారు. వలసల జిల్లాగా పేరుబడ్డ పాలమూరులో రివర్స్ మైగ్రేషన్ సాధ్యమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన 10 శాతం పనులను కూడా రేవంత్ రెడ్డి పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నర్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ వంటి రిజర్వాయర్లను పూర్తి చేసి, పంపులు ఆన్ చేసి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డనని చెప్పుకోవడం, ప్రాజెక్టులకు మామగారి పేరు పెట్టుకోవడం తప్ప%ొ% ఇప్పటివరకు రైతులకు ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేదన్నారు.ఎన్టీ రామారావు వంటి మహానాయకుడే కల్వకుర్తిలో ఓడిపోయారని, రాజకీయాల్లో గెలుపు-ఓటములు సహజమని కార్యకర్తలకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధిక వ్యవసాయ పంపుసెట్లు ఉన్న ప్రాంతమని, అక్కడ కరెంట్ కష్టాలు లేకుండా సబ్ స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని గుర్తు చేశారు.

### పైలట్ ప్రాజెక్టుగా

## వేములవాడలో గోశాల ఏర్పాటు

- మంత్రి వాకిటి శ్రీహరి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



మానవతావాదిగా జంతువుల రక్షణకు కట్టుబడి ఉన్నాననీ, పశువుల రక్షణ బాధ్యత మానవాళి ఆర్థికాభివృద్ధికి చేయూత అని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా వేములవాడలో గోశాల ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్ లోని ఓ హోటల్‌లో జరిగిన విపత్తుల సమయాల్లో జంతువులకు జరిగే ప్రమాదాల నివారణపై సదస్సు లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే జంతువులు పసిగడు తాయని తెలిపారు. విపత్తుల వల్ల మూగజీవాలకు జరిగే నష్టాన్ని నివారిం చడానికి మంత్రిగా కాకుండా మానవత్వంతో పని చేస్తానని హామీనిచ్చారు. తెలంగాణలో గో సంరక్షణ పేరుతో ప్రభుత్వ పాలసీ తీసుకొచ్చామన్నారు. గోశాల నిర్వహణ విధివిధానాలు రూపొందిస్తున్నా మని తెలిపారు. గ్లోబల్‌వార్మింగ్, యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మానవజాతితో పాటు జంతువులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొం టున్నాయని వివరించారు. తెలంగాణ వరదలకు, కరువు కాటకాలకు గురయ్యే ప్రాంతమనీ, ఆ సమయాల్లో జంతువులు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని తెలిపారు. 2024లో సంభవించిన వరదల వల్ల ఎన్నో పశుపక్షాదులను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విపత్కర సమయాల్లో జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని నొక్కి చెప్పారు. రాష్ట్రంలో పశు వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. మొబైల్ వెటర్నరీ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. జంతువుల రక్షణ కోసం పనిచేస్తున్న అన్ని ఎన్‌జీవో సంస్థలతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణ లో 26 లక్షల కుటుంబాలు పశు సంపద, పౌల్ట్రీ పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నాయని వివరిం చారు. గ్రామీణ ప్రాంత సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితంలో పశు సంపద కీలక పాత్ర వహిస్తుందని చెప్పారు. సదస్సు నిర్వహించిన హ్యూమన్ ఫర్ యానిమల్స్ ఇండియా, యునిసెఫ్ ఇండియా సంస్థలను అభినందించారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందకుమార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపాల్, డాక్టర్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ ఓఎస్‌డిని సిట్ విచారణ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సమీపంగా పనిచేసిన ఓఎస్డి కె. రాజశేఖర్ రెడ్డిని సిట్ అధికారులు గురువారం విచారించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు విచారణ జరిపి అధికార వాంగ్మూలాన్ని రికార్డు చేసినట్లు సమాచారం. గత ఏడాది మార్చిలో అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో సిట్ దర్యాప్తును ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. రాధా కిషన్ రాసిన వాంగ్మూలంలో మాజీ సీఎం కేసీఆర్ పేరు ప్రస్తావనకు వచ్చిందని, కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన వ్యవహారాలు "సెటిల్" చేయడానికి తామే సహాయం చేశామని ఆయన చెప్పినట్లు అప్పట్లో ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ మాజీ ఓఎస్డి రాజశేఖర్ రెడ్డిని కూడా సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆయన స్టేట్‌మెంట్‌ను పూర్తిగా రికార్డు చేసినట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు సిట్ అధికారులు నిందితులతో పాటు భారీ సంఖ్యలో బాధితులను కూడా విచారించారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.

## హైడ్రా కమిషనర్ ప్రత్యక్షంగా కోర్టులో హాజరు కావాలి

- లేకపోతే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తాం..
- తెలంగాణ హైకోర్టు



**బలగం టీవీ, హైదరాబాద్**

బతుకమ్మ కుంట వివాదంలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టులో ప్రత్యక్షంగా హాజరు కాకపోతే నాన్–బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని న్యాయమూర్తి హెచ్చరించారు. కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేసినందుకు గాను ఆయనపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది.

## మహబూబ్ పట్నం పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే

- ఆరుగురు ఎస్టీ ఓటర్లకు సర్పంచ్, మూడు వార్డు స్థానాల రిజర్వేషన్ ఎలా?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు




**బలగం టీవీ, మహబూబాబాద్**

మహబూబాబాద్ జిల్లాలోని మహబూబ్ పట్నం గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై స్టే విధిస్తూ హైకోర్టు న్యాయమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్ పట్నం పంచాయతీలో కేవలం ఆరుగురు ఎస్టీ ఓటర్లు మాత్రమే ఉన్నప్పటికీ, వారికి ఏకంగా ఒక సర్పంచ్ స్థానం మరియు మూడు వార్డు స్థానాలను రిజర్వ్ చేయడాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ రిజర్వేషన్లపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి, ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఉన్న ఆరుగురు ఎస్టీ ఓటర్లు ఒకే వార్డు పరిధిలో ఉంటే, మిగతా మూడు వార్డులకు సభ్యులను ఎలా ఎంపిక చేస్తారు?" అని ధర్మాసనం ప్రభుత్వాన్ని నిలదీసింది. ఓటర్ల సంఖ్యకు, రిజర్వ్ చేసిన స్థానాలకు మధ్య ఉన్న వ్యత్యాసంపై సమగ్ర వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.




## మాదక ద్రవ్యాల పట్ల అవగాహన అవసరం..

- సెల్ ఫోన్లు ప్రమాదకరం
- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అత్యవసరం అని జిల్లా సంక్షేమ అధికారి (డి.డబ్ల్యూ.వో) లక్ష్మీరాజం సూచించారు. పెద్దూరు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'నషా ముక్త్ భారత్ అభియాన్', 'మిషన్ పరివర్తన', 'మహిళ సాధికారత', మరియు 'సఖి కేంద్రం' సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణ, బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న హింస, బాలల హక్కుల సంరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.డబ్ల్యూ.వో లక్ష్మీరాజం మాట్లాడుతూ.. పాఠశాలలో ఉన్నప్పుడు విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నప్పటికీ, ఇంటి వద్ద తల్లిదండ్రుల నియంత్రణ లేకపోవడం వల్ల సెల్ ఫోన్ మరియు డ్రగ్స్‌కు ఆకర్షితులు అవుతున్నారని పేర్కొన్నారు. అమ్మాయిల భారాన్ని త్వరగా తగ్గించుకోవాలని భావించి బాల్య వివాహాలు జరపడం సరికాదని స్పష్టం చేశారు. సమాజంలో ధనియాలు, మిరియాలు, బెల్లం, బియ్యం పిండి, మాత్రల రూపంలో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని, అలాంటి వాటికి అలవాటు పడొద్దని, డ్రగ్స్ వినియోగం లేదా సరఫరా గురించి తెలిస్తే 1908 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ.. సెల్ ఫోన్‌లో అసభ్యకరమైన చిత్రాలు చూడటం వల్ల విద్యార్థుల ఆలోచనలు క్రిమినల్‌గా మారుతున్నాయని సూచించారు. బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. సెల్ ఫోన్లలో బాలికల ఫోటోలను డీపీలుగా పెట్టడం వల్ల వాటిని మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బాలల హక్కులను రక్షించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక బాధ్యత వహించాలని తెలిపారు. విద్యార్థుల హక్కులకు భంగం కలిగితే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ స్పెషలిస్ట్ దేవిక, ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బృందం (గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, జంగపల్లి రాజమల్లు, ఈరబోయిన రవి కుమార్, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్), జిల్లా కమ్యూనిటీ ఎడ్యుకేటర్ జనార్దన్ మంద, సఖి కేస్ వర్కర్ కవిత, మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గుప్త నిధుల పేరుతో మోసం చేసిన వ్యక్తుల అరెస్ట్

- నలుగురు వ్యక్తులు అరెస్ట్
- రూ.3 లక్షలు స్వాధీనం..
- గుప్త నిధుల పేరుతో రూ.4 లక్షలు కాజేసిన కేటుగాళ్లు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

స్వామీజీ వేషధారణలో అమాయక ప్రజలను నమ్మించి, ఇంట్లో నిధులు ఉన్నాయని, వాటిని బయటకు తీస్తామని చెప్పి బెదిరించి భారీగా డబ్బులు కాజేసిన నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఈ వివరాలను వెల్లడించారు. ?

సుమారు రెండు నెలల క్రితం, సెప్టెంబర్ రెండో వారంలో, పెద్దూరు గ్రామానికి చెందిన మేకల నరేష్ అనే వ్యక్తి స్వామీజీ వేషంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన దుగ్గు వేణు ఇంటికి వచ్చాడు. అతనికి పిల్లలు లేరని తెలుసుకున్న నరేష్, ఇంట్లో ఎవరో మంత్రాలు చేశారని, అందుకే పిల్లలు కలగడం లేదని నమ్మించాడు. తాయత్తులు కడతానని చెప్పి తొలి విడతగా రూ. 3,000 తీసుకున్నాడు. వేణు కుటుంబం డబ్బు ఇవ్వడంతో, ఇంకా ఎక్కువ లాగాలని పథకం పన్నిన నరేష్, వారి ఇంట్లో బంగారు నిధి దాగి ఉందని, దానిని బయటకు తీసే శక్తి తన వద్ద ఉందని నమ్మించాడు. తన మిత్రుడైన బాబాను పిలిపించి పూజలు చేస్తానని చెప్పి, వేణు నుంచి ముందుగా రూ. 50,000 తీసుకున్నాడు.? ఆ తర్వాత నరేష్‌తో పాటు పెద్దూరుకు చెందిన కడవంచ ప్రసాద్, సిరిసిల్ల చంద్రంపేటకు చెందిన సదుల దేవేందర్ కలిసి రాత్రిపూట వేణు ఇంటికి వచ్చారు. ఇంట్లో పూజలు చేసినట్టు నటించి, నిధి కోసం గుంత తవ్వినట్టుగా చేసి, అందులో ఒక చిన్న విగ్రహం లాంటిది పెట్టి, అది కొద్దిగా కనిపించేలా చేసి వెంటనే మూసివేశారు. ఆపై, "మీ ఇంట్లో నిధికి నాగబంధం ఉన్నది. మనం ఇలానే తవ్వితే మన ప్రాణాలు పోతాయి" అని బెదిరించారు.

నాగబంధం తొలగించాలంటే అఘోరాను పిలిపించి క్షుద్ర పూజ చేయాలని, ఇందుకోసం మరో రూ. 3,40,000 ఖర్చు అవుతుందని, లేదంటే నాగబంధం విడుదలయ్యి ఇంట్లో వారందరికీ అరిష్టం జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని వేణు కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేశారు. భయపడిన వేణు ఆ మొత్తాన్ని వారికి చెల్లించడానికి అంగీకరించాడు.? నాలుగు రోజులకు డబ్బు ఇచ్చిన తర్వాత, ముగ్గురు నిందితులు చంద్రంపేటకు చెందిన సదుల రాజేశం అనే మరొక వ్యక్తిని అఘోరా వేషంలో తీసుకొని వచ్చారు. పూజ చేసినట్టు నటించి, గుంత తవ్వుతుండగా, వారు వెంట తెచ్చుకున్న కోరలు తీసిన పామును ఆ గుంతలో వేశారు. ఆ పాము సదుల దేవేందర్‌ను కరిచినట్టుగా నమ్మించి, దేవేందర్ రక్తం కక్కుతున్నట్టుగా నటించాడు. అతన్ని అర్జెంట్‌గా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ప్రాణం పోతే మీ ఇంటికే ప్రమాదం, మీపైనే కేసు అవుతుంది అంటూ బెదిరించారు. భయపడిన వేణు వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లమని కోరగా తమ దగ్గర డబ్బులు లేవని చెప్పి, అదనంగా మరో రూ. 15,000 ఇవ్వాలని బెదిరించి వసూలు చేశారు. మొత్తం రూ. 4,08,000 కాజేసి, దేవేందర్‌ను హాస్పిటల్‌కు తీసుకెళ్లిన ట్టుగా నటించి అక్కడి నుంచి ఉడాయించారు.? ఆ తర్వాత నరేష్ ఎంత ప్రయత్నించినా దొరకకపోవడంతో, మోసపోయానని గ్రహించిన బాధితుడు దుగ్గు వేణు, తేదీ 25.11.2025న కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా, నిజామాబాద్ గ్రామ శివారులోని వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద నిందితులు మేకల నరేష్, కడవంచ ప్రసాద్, సదుల దేవేందర్ మళ్లీ గ్రామంలో సంచరించడానికి రాగా, ముందస్తు సమాచారం మేరకు ఎస్.ఐ. ప్రశాంత్ రెడ్డి స్టేషన్ సిబ్బంది మరియు సీసీఎస్ టీం వారితో కలిసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి రూ. 3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.? ఈ కేసు ఛేదించిన ఎస్.ఐ. ప్రశాంత్ రెడ్డి స్టేషన్ సిబ్బంది మరియు సీసీఎస్ టీం వారిని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు.?

ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఒక విజ్ఞప్తి చేశారు. "ఎవరైనా వ్యక్తులు స్వామీజీ వేషంలో వచ్చి మీ ఇంట్లో నిధి ఉన్నదని గానీ, లేదా ఇతర బలహీనతలను ఆసరాగా చేసుకుని నమ్మించడానికి ప్రయత్నం చేసినట్లయితే, ప్రజలు ఎవరూ వాటిని విశ్వసించరాదు" అని కోరారు. అలాంటి వారెవరైనా గ్రామంలో సంచరిస్తున్నట్టు సమాచారం ఉన్నట్లయితే, వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని సీఐ వెంకటేశ్వర్లు కోరారు.

## నిధులు తెచ్చి పల్లెలను అభివృద్ధి చేసేటోళ్లకే పట్టం కట్టండి..

- కేంద్రం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి..
- బీజేపీ ప్రతినిధులను గెలిపిస్తేనే పల్లెలకు మోక్షం
- బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిధులు తెచ్చి పల్లెలను అభివృద్ధి చేయగలిగే నాయకులకే ప్రజలు పట్టం కట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ప్రజలకు పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా రాష్ట్రం అప్పుల ఊబిలో మునిగిపోయిందని చెబుతున్న నేపథ్యంలో మరి గ్రామాలను ఎలా అభివృద్ధి చేస్తారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని గోపి డిమాండ్ చేశారు. ఖజానాలో పైసల్ లేవని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ఎట్లా చేస్తది? ఈ విషయాన్ని ప్రజలు గమనించాలి అని ఆయన అన్నారు.నిధులు లేని స్థానిక ఎమ్మెల్యే పల్లెలను ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నిస్తూ ఒక ఎమ్మెల్యేకు నిధులు తీసుకురావడంలో ఉన్న పరిమితులను గ్రామాల ప్రజలు గుర్తించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులే ప్రధాన ఆధారమనే విషయాన్ని ప్రజలు గమనించాలని గోపి అన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధుల ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే, ఫండ్స్ తెచ్చి పల్లెలను అభివృద్ధి చేసే బాధ్యత బండి సంజయ్ కుమార్ అని ఆయన హామీ ఇచ్చారు. బండి సంజయ్ సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని రెడ్డబోయిన గోపి ఈ సందర్భంగా వివరించారు.? తంగళ్లపల్లి మండలానికి ఇప్పటివరకు రూ. 1.75 కోట్లు (%చీక్షుజు+టా%) నిధులు మంజూరూ అయ్యాయని, ఎంపీ ల్యాండ్ నిధుల ద్వారా 15 బోర్లు వేయించారు.?వివిధ గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లకు సుమారు రూ. 30 లక్షలు మంజూరు చేశారు. సీఎస్ఆర్ (%జూక్ష్మ%) నిధుల నుంచి అంబులెన్స్‌లను కొనుగోలు చేసి ఆసుపత్రులకు అందజేశారు. సుమారు 20 వేల సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేయడంతో పాటు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించడానికి కూడా ముందుకొచ్చారు.?ఏకగ్రీవం అయ్యే పంచాయతీలకు రూ. 10 లక్షల నజరానా ఇవ్వడానికి కూడా బండి సంజయ్ సిద్ధంగా ఉన్నారని గోపి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రజలు, రైతులను పట్టించుకోకుండా జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని గోపి విమర్శించారు. గెలిపించిన సిరిసిల్ల ప్రజలను మరిచి రాష్ట్ర రాజకీయాల్లో బిజీ అయ్యారని దుయ్యబట్టారు.ఫండ్స్ లేని స్థానిక ఎమ్మెల్యే పల్లెలను అభివృద్ధి చేయలేరని, ప్రజలు ఈ రెండు విషయాలను గుర్తుంచుకోవాలని కోరారు. బండి సంజయ్ ప్రతినిధులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మంచిర్యాలలో 'దీక్షా దివస్' సన్నాహక సమావేశం..

- మాజీ ఎంపీ బాల్క సుమన్

**బలగం టీవీ, మంచిర్యాల**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్ష చేపట్టిన రోజు (నవంబర్ 29, 2009) తెలంగాణ గతిని మార్చిన "దీక్షా దివస్". ఈనెల 29వ తేదీన మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించిన మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎంపీ %డ% మాజీ చెన్నూర్ శాసనసభ్యులు బాల్క సుమన్. ఈ కార్యక్రమం విజయవంతం కొరకై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. దీక్షా దివస్ రోజున కార్యకర్తలు, నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, అనుబంధ సంఘ సభ్యులు జిల్లా పార్టీ కార్యాలయానికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.



# రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు మూడు ఫేజ్ లలో నిర్వహణ
- జిల్లాలో మొత్తం 260 జీపీలు, 2268 వార్డులు, మొత్తం పోలింగ్ కేంద్రాలు 2268
- హెల్ప్ లైన్ నెంబర్ 1800 233 1495
- ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ కోరారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలకు అధికారులు సమాధానం ఇచ్చారు. ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్, ఫిర్యాదుల కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. 1800 233 1495 అందుబాటులో ఉంటుందని వివరించారు. పోటీ చేసే అభ్యర్థులు నూతన బ్యాంక్ ఖాతా ఓపెన్ చేయాలని, నామినేషన్ పత్రాలు పూర్తిగా నింపాలని, తమ పూర్తి సమాచారాన్ని నింపాలని తెలిపారు. ప్రచార వాహనాల అనుమతి తహసీల్దార్, లౌడ్ స్పీకర్, ర్యాలీలకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ప్రతి పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించి వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు. నామినేషన్లు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 05.00 గంటల వరకు తీసుకుంటారని వెల్లడించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారానికి సంబంధించి జిల్లా పౌర సంబంధాల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, డీపీఓ షర్ఫుద్దీన్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ ఏర్పాటు..

- ప్రారంభించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ సెంటర్, మీడియా సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 24 గంటలు పని చేసే కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ను పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. మీడియా లో ఫేక్ న్యూస్ ప్రసారమైన, ఓటర్లు ఏదైనా సందేహాల నివృత్తికి, సమాచారం కోసం సంప్రదించిన వెంటనే స్పందించాలని చెప్పారు. ఎన్నికల ఫిర్యాదులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూం నెంబర్ 1800 233 1495 అందుబాటులో ఫోన్ చేసి చెప్పవచ్చని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, డీపీఓ శర్ఫుద్దీన్, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్ బ్లాస్టింగ్ నిజమే అంటున్న ఇరిగేషన్ అధికారులు

- క్రరీంనగర్ జిల్లాలో చెక్ డ్యామ్ బ్లాస్టింగ్
- ప్రభుత్వానికి రూ.3 కోట్ల నష్టం

**బలగం టీవీ, కరీంనగర్**

కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మండలం, తనుగుల గ్రామంలోని చెక్ డ్యామ్ వద్ద బ్లాస్టింగ్ జరిగింది వాస్తవమేనని ఇరిగేషన్ శాఖ అధికారులు ధృవీకరించారు. ఈ ఘటనపై ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఈ బ్లాస్టింగ్ కారణంగా చెక్ డ్యామ్ సుమారు 90 మీటర్ల మేర ధ్వంసమైంది. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ. 3 కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



10. Total Value of Property stolen / Involved : --
11. Inquest Report / U.D case No. if any : --
12. Contents of the complainant / statement of the complainant or informant :

IN THE COURT OF HON'BLE II ADDL JFCM COURT AT HUZURABAD.

Honoured Madam

The brief facts of the case are that on 22-11-2025 at 19:00 hours, the complainant Palakurthi Ravi s/o Sammaiah, came to the Police Station and lodged a Telugu typed complaint, in which he stated that he is working as a Deputy Executive Engineer in the Irrigation Department, Kalvasrirampur Mandal. He further stated that a check dam on the Manair stream, situated on the outskirts of Thanugula Village, Jammikunta Mandal, was commenced in the year 2021 and completed in 2024, through which irrigation is being provided to approximately 1,000 acres. On 22-11-2025 at about 06:30 hours, local farmers informed him over phone that on the night of 21-11-2025 at around 22:00 hours, they heard a loud noise near the check dam and suspected that it had been damaged. Immediately, he proceeded to the location along with his staff and, upon inspection, found that about 90 meters of the check dam had been destroyed. When the surrounding farmers were examined regarding the incident, it was suspected that unknown persons had intentionally demolished the check dam. He also informed his higher authorities about the incident. Due to the destruction of the check dam, the State Government has suffered an estimated loss of Rs. 3,00,00,000/-. Photographs of the damaged check dam were enclosed with the petition. Hence, the complainant requested that necessary action be taken against the unknown persons who destroyed the check dam constructed on the Manair stream at the outskirts of Thanugula Village. Hence F.I.R

13. Action taken : Since the above information reveals commission of offence (s) U/Sec. 329(3), 324(5) BNS, Sec. 3 of PDPP Act
(1) Registered the case and took up the investigation
(2) Directed ( Name of I.O ) S. Ramakrishna Rank : Inspector of Police to take up the investigation or Took up the investigation
(3) Refused investigation due to
(4) Transferred to P.S District on point of jurisdiction.

F.I.R read over to the Complainant / Informant, admitted to be correctly recorded and copy given to the complainant / Informant, free of cost.

14. Signature / Thumb Impression of the Complainant / Informant. Signature of Officer in charge of Police Station.
Name: S. Ramakrishan
Rank:-Inspector of Police
PS Jammikunta
No : CI

15. Date and time of dispatch to the Court: On 22-11-2025 at 19.30 hrs.

# ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా విధులు నిర్వహించాలి



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నోడల్ అధికారులు తమ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. నోడల్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఎస్పీ మహేష్ బి గీతే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశమై, వారి విధుల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నోడల్ అధికారుల విధులు, బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం చేపట్టినట్లు తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, శిక్షణ, రవాణా, మోడల్ కోడ్ కండక్ట్, ఖర్చు పర్యవేక్షణ, పోస్టల్ బ్యాలెట్, ఎలక్టోరల్ రోల్స్, ఎన్నికల పరిశీలకులు విషయమై నోడల్ అధికారుల నియామకం చేసినట్లు తెలిపారు. వివిధ అంశాలకు సంబంధించి నియామకం చేసిన నోడల్ అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలకు సంబంధించి అన్ని విధాలుగా సర్వ సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల నిబంధనలు సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సరిపోను సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. పర్యవేక్షణ బృందాల రవాణాకు కావాల్సిన వాహనాలు సిద్ధపర్చుకోవాలన్నారు. వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగానికి వచ్చే ఎన్నికల ఫిర్యాదులను వేగంగా, క్వాలిటీ పరిష్కారం చూపేలా సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ శర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలపై ఫిర్యాదులకు ఆన్లైన్ పోర్టల్

- ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో వివిధ అంశాలపై ఫిర్యాదు చేసేందుకు ఆన్లైన్ పోర్టల్ అందుబాటులోకి వచ్చిందని ఇంచార్జి కలెక్టర్, ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఓటర్ల జాబితా, నామినేషన్లు, ఓట్ల లెక్కింపు ఇతర అంశాలపై కింద ఇచ్చిన ఆన్లైన్ పోర్టల్ (గ్రీవెన్స్ టీ సెక్ జీఓవీ.ఇన్) Grievance T Sec Gov.in కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యాక్ట్ అమలు..

- నవంబర్ 1 నుండి 30 వరకు ఆంక్షలు
- అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిషేధం
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను పటిష్టం చేసే లక్ష్యంతో, పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల పాటు అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. నవంబర్ 1వ తేదీ నుండి నవంబర్ 30వ తేదీ వరకు ఈ నిబంధనలు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.ఈ యాక్ట్ అమలులో ఉన్నందున, పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీలు లేదని ఎస్పీ ఆదేశించారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించారాదని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ప్రజలు ఎవరూ కూడా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలంతా పోలీసు వారికి ఇట్టి విషయంలో పూర్తిగా సహకరించి, ఈ నెల రోజుల పాటు శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తూ పోలీసులు చేస్తున్న కృషికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఎస్పీ మహేష్ బి.గితే విజ్ఞప్తి చేశారు.



# తిరుమల శ్రీవారి సేవలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీవారిని వేడుకున్న ప్రభుత్వ విప్

**బలగం టీవీ, తిరుమల**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గురువారం వేకువజామున తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం, ఆలయ అర్చకులు ప్రభుత్వ విప్ కుటుంబ సభ్యులకు మర్యాదపూర్వకంగా వేదాశీర్వచనం అందించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంల ో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలంతా పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ ఏడుకొండల వెంకటేశ్వర స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగాలని కోరుకున్నారు. అంతేకాక, తమ నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలియజేశారు. ఆది శ్రీనివాస్ తిరుమల పర్యటన సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, టీటీడీ అధికారులు వారికి స్వాగతం పలికారు.

# సంగీతం శ్రీనివాస్‌కు పద్మశాలి సంఘం సన్మానం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



నూతనంగా కాంగ్రెస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులుగా నియమించబడిన సంగీతం శ్రీనివాస్ ని, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు గాజుల బాలయ్య పద్మశాలి ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్ కి శాలువా కప్పి, పూలమాలలు వేసి, పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నూతన బాధ్యతల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా పద్మశాలి సంఘం నాయకులు నూతన అధ్యక్షుడికి అభినం దనలు తెలిపి, తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీకి చెందిన పలువురు ముఖ్యులు పాల్గొన్నారు. వారిలో ప్రధాన కార్యదర్శి దిడ్డి రాజు పద్మశాలి, ఉపాధ్యక్షులు కొండ ప్రతాప్, పోతు అంజనేయులు, కార్యదర్శి నాగుల విష్ణు ప్రసాద్, కమిటీ సభ్యులు ఉన్నారు.

# జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్

- వడోదరలో గ్రాండ్ ఫైనల్





**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్‌కు సంబంధించిన ముఖ్య వివరాలను బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. మెగా వేలం సందర్భంగా డబ్ల్యూపీఎల్ ఛైర్మన్ జయేశ్ జార్జ్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ఈసారి టోర్నీ జనవరి 9, 2026 నుంచి ప్రారంభం కానుంది. ముందుగా ప్రచారంలో ఉన్న జనవరి 7 తేదీ బదులుగా జనవరి 9నే అధికారికంగా ఖరారు చేశారు. పురుషుల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని తేదీలను కొంత ముందుకు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ సారి లీగ్ మ్యాచ్‌ల కోసం కేవలం రెండు వేదికలు మాత్రమే నిర్ణయించారు. నవీ ముంబై మరియు వడోదర వేదికలలోనే మొత్తం సీజన్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జనవరి 9న నవీ ముంబైలో లీగ్ ఆరంభమవుతుండగా, ఫిబ్రవరి 5న వడోదరలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పూర్తి షెడ్యూల్‌ను త్వరలో బీసీసీఐ విడుదల చేయనుంది.

# ప్రభాస్ 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**





డార్లింగ్ ప్రభాస్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రోజు వచ్చేసింది. పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్–క్రేజీ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక యాక్షన్ డ్రామా 'స్పిరిట్' షూటింగ్‌ను ప్రభాస్ గురువారం నుంచి అధికారికంగా ప్రారంభించారు.

కొద్ది రోజుల క్రితమే విడుదలైన డార్క్ ఆడియో టీజర్‌లో ప్రభాస్ ఒకవైపు ఇంటెన్స్ పోలీస్‌గా, మరోవైపు రఫ్ లుక్‌లో ఖైదీలా దర్శనమిచ్చాడు. రెండు కాన్ట్రాస్టింగ్ షేడ్స్ చూపించిన ఆ గ్లింప్స్ ఫ్యాన్స్, నెట్‌జన్స్ మధ్య విపరీత హైప్ క్రియేట్ చేశాయి. అదే ఎనర్జీతో ప్రస్తుతం ర్యాపిడ్ ఫైర్ షూటింగ్ జరుగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న భారీ షెడ్యూల్‌లో కీలక యాక్షన్ సన్నివేశాలు, రా ఎమోషన్స్‌తో కూడిన హై డ్రామా సీన్లను చిత్రీకరించనున్నట్లు తెలిసింది. వంగా కెమెరా ఆన్ చేస్తే ఎలాంటి ఇంటెన్సిటీ వస్తుందో 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చూసిన తర్వాత చెప్పనవసరం లేదు. ఇప్పుడు ఆ స్థాయిలోకి ప్రభాస్ ఎంటర్ అవ్వడం ఫ్యాన్స్‌లో షాక్ అండ్ థ్రిల్ మిక్స్ ఫీలింగ్‌ను పెంచుతోంది.

# జయ కృష్ణ ఘట్టమనేని డెబ్యూ ఫిక్స్

## 'శ్రీనివాస మంగాపురం' టైటిల్, ప్రీ-లుక్ పోస్టర్ ఔట్

**బలగం టీవీ, హైదరాబాద్**




సూపర్ స్టార్ కృష్ణ వారసత్వంలో మరో కొత్త హీరో ఎంట్రీకి సిద్ధమయ్యాడు. దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు జయ కృష్ణ ఘట్టమనేని తొలి చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ డెబ్యూ ప్రాజెక్ట్‌కు 'శ్రీనివాస మంగాపురం' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ ప్రీ–లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.

ఆర్‌ఎక్స్ 100', 'మంగళవారం' వంటి ఇన్‌టెన్స్ డ్రామాలతో పేరు సంపాదించిన దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఘనతవహించిన వైజయంతీ మూవీస్ అధినేత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. కృష్ణతో 'అగ్ని పర్వతం', మహేష్ బాబుతో 'రాజకుమారుడు' చేసిన ఆయన ఇప్పుడు మూడో తరం స్టార్ జయ కృష్ణను పరిచయం చేయడం ప్రత్యేకతగా మారింది. 'చందమామ కథలు' బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు.

విడుదలైన పోస్టర్‌లో హీరో, హీరోయిన్ల చేతులు పెనవేసుకుని ఉండటం చూడొచ్చు. హీరో గాయపడిన చేయి పట్టుకున్న నాటు గన్ను, దాన్ని గట్టిగా పట్టుకున్న హీరోయిన్ చేయి బంధాన్ని చూపిస్తున్నాయి. ఇది రొమాన్స్ మరియు హై–స్టేక్స్ యాక్షన్ కలబోసిన కథ అని సూచిస్తోంది. అలాగే పవిత్ర తిరుమల దేవాలయం, శేషాచలం కొండలు కనిపించడం సినిమాకు ఆధ్యాత్మిక మరియు లోతైన నేపథ్యాన్ని జోడించాయి. "రెండు జీవితాలు– ఒకే ప్రయాణం. రెండు చేతులు – ఒకే వాగ్దానం. రెండు హృదయాలు – ఒకే గమ్యం" అనే క్యాప్షన్ ప్రీ–లుక్‌కు మరింత బలాన్ని ఇచ్చింది. బాలీవుడ్ నటి రాషా థడానీ ఈ చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయం అవుతోంది. ఇటీవలే అనేక చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్ అందించిన జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. జయ కృష్ణ ప్రస్తుతం తన పాత్ర కోసం శిక్షణ పొందుతూనే షఉటింగ్‌లో పాల్గొంటున్నారు. టైటిల్, ప్రీ–లుక్ పోస్టర్‌తోనే భారీ బజ్‌ను సృష్టించిన మేకర్స్, త్వరలోనే ఫస్ట్ లుక్‌తో పాటు మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను ప్రకటించనున్నారు



**ప్రముఖ గాయకుడు, ఆస్కార్ అవార్డు విజేత రాహుల్ సిప్లిగంజ్ జీవితంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. తన ప్రియురాలు హరిణ్యతో రాహుల్ గురువారం తెల్లవారుజామున వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వేడుక ఎంతో ఆప్యాయంగా జరిగింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ గ్రాండ్ వెడ్డింగ్‌కు పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేడుకలో తీసుకున్న ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.** **బలగం టీవీ, హైదరాబాద్**

# మెగా వేలంలో మహిళా క్రికెటర్ల దూకుడు

- డబ్ల్యూపీఎల్ వేలంలో కోట్ల వర్షంలో కొత్త రికార్డులు
- అమీలియా కెర్‌ను 3 కోట్లకు కొనుగోలు చేసిన ముంబై ఇండియన్స్
- రూ.1.30 కోట్లు పలికిన తెలుగమ్మాయి శ్రీ చరణి
- సొంతం చేసుకున్న ఢిల్లీ







**బలగం టీవీ, హైదరాబాద్**

క్రికెట్‌ను 'జెంటిల్మన్ గేమ్'గా పిలిచే రోజులు పోయాయి. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో మాత్రమే కాదు ఇప్పుడు బరిలోకి వచ్చినప్పుడు రికార్డులకే చెమటలు పట్టిస్తున్నారు మహిళా క్రికెటర్లు. మహిళల ప్రీమియర్ లీగ్ మెగా వేలంలో ఈ దూకుడే మరోసారి కనిపించింది.

వరల్డ్ కప్‌లో అదరగొట్టిన టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మపై జట్ల మధ్య భారీ పోటీ నెలకొంది. చివరకు రూ.3.20 కోట్లు ధర పలికి ఈ సీజన్‌లోనే అత్యంత ఖరీదైన ప్లేయర్‌గా నిలిచింది. యూపీ వారియర్స్ మరియు ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య గట్టి పోరు జరిగింది. చివరకు యూపీ వారియర్స్ తమ రైట్ టు మ్యాచ్' ఉపయోగించి దీప్తిని తిరిగి తీసుకుంది.

**శ్రీచరణి మరో సంచలనం**

ప్రపంచకప్‌లో స్పిన్‌తో ప్రత్యర్థులను తిరుగులేకుండా చేసిన శ్రీ చరణి కూడా భారీ ధర సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను రూ.1.30 కోట్లకు మొదలుపెట్టింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌కు ఇదే అతిపెద్ద వేలం ధర.

అద్భుత ఫామ్‌లో ఉన్న అనేక యువ ఆటగాళ్లు కూడా ఈ మెగా వేలంలో కోట్లను కొల్లగొట్టారు. వీరి ప్రతిభను చూసి జట్లు ఎలాంటి సందేహం లేకుండా భారీగా బిడ్లు వేశాయి.

**విదేశీ ఆటగాళ్లలో అమేలియా కేర్ టాప్**

ఆర్టీఎం కాకుండా అత్యధిక ధర పలికిన ఆటగాళ్ల జాబితాలో న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్ అగ్రస్థానంలో నిలిచింది. ముంబై ఇండియన్స్ ఆమెను రూ.3 కోట్లకు దక్కించుకుంది.

విదేశీ ఆటగాళ్ల టాప్ బిడ్స్

అమేలియా కేర్– రూ.3 కోట్లు (ముంబై ఇండియన్స్)

సోఫీ డెవినె–రూ.2 కోట్లు (గుజరాత్ జెయింట్స్)

చినెల్లె హెన్రీ–రూ.1.30 కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్)

ఫొబె లిచ్‌ఫీల్డ్– రూ.1.20 కోట్లు (యూపీ వారియర్స్)

లారెన్ బెల్–రూ.90 లక్షలు (ఆర్సీబీ)

**భారత ఆటగాళ్లలో టాప్ – 5**

దీప్తి శర్మ – రూ.3.20 కోట్లు

శిఖా పాండే – రూ.2.40 కోట్లు (యూపీ వారియర్స్)

శ్రీచరణి –రూ.1.30 కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్)

ఆశా శోభన–రూ.1.10 కోట్లు

భారతి ఫుల్‌మలి –రూ.70 లక్షలు

# ఎన్నికల వేళ సోషల్ మీడియా పై నిఘా కఠినతరం చేయాలి..



- గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిద్ధం..
- ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి..
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో పంచాయితి ఎన్నికలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించి,ఎన్నికలను శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహిద్దామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామపంచాయితి ఎన్నికలు మూడు విడుతాలలో జరిగే ఎన్నికలు పూర్తి స్థాయి పటిష్ట భద్రత ఏర్పాట్లతో ప్రశాంత వాతవరణంలో నిర్వహిద్దామని, ఎన్నికల నిర్వహణలో ఇప్పటికే అనుభవం ఉన్న అధికారులు, సిబ్బంది నూతనంగా డిప్లాయ్ అయిన సిబ్బందికి మార్గదర్శనం చేస్తూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళికి విరుద్దంగా వ్యవహరించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తూ అక్రమ మద్యం,నగదు, ఉచితల పంపిణీపై నిఘా ఉంచుతూ,ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు, డైనమిక్ చెక్ పోస్ట్ లు పెట్టి తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచుతూ అధికారులు తరచుగా పర్యటిస్తూ పరిస్థితులను నియంత్రణలో ఉంచాలని తెలిపారు.

ఎన్నికల అనంతరం నిర్వహించే విజయోత్సవ ర్యాలీలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచి, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నెరస్థులతో పాటు, ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడేవారు, రౌడి షీటర్స్ పై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచి,అవసరం అయితే బైండోవర్ చేయాలని ఆదేశించారు.

గ్రామ పంచాయితి ఎన్నికల సందర్భంగా జిల్లలో సోషల్ మీడియా పై నిఘా కటినతరం చేసి విద్వేషాలు రేచ్చగోట్టేల , ప్రజలను తప్పుదోవ పట్టించేలా వచ్చే ప్రకటనలు పోస్ట్ చేసిన,షేర్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్ లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ ఆదేశించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి, ఇన్స్పెక్టర్లు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి..

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



కేంద్ర ఆరోగ్య పథకాల లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసి రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అధికారులకు సూచించారు. డయాబెటిస్, రక్తపోటు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు సకాలంలో చికిత్స అందించాలని, వాటి వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.? ఈ మేరకు గురువారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పి.హెచ్.సీ. వైద్యాధికారులు మరియు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లుతో కేంద్ర ఆరోగ్య పథకాల అమలుపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో డాక్టర్ రజిత మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ పథకాల లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.? ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులైన డయాబెటిస్, రక్తపోటు (బీపి) మరియు క్యాన్సర్ సంబంధిత వ్యాధులను గుర్తించి, రోగులకు తక్షణమే, సకాలంలో చికిత్స అందించాలన్నారు. అంతేకాకుండా, చికిత్స పొందిన ప్రతి ఒక్కరి వివరాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయవలసిందిగా వైద్యాధికారులు, ఎంఎల్?హెచ్?పి లను ఈ సందర్భంగా ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, డాక్టర్ నహిమ, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్?హెచ్?పి లు మరియు కార్తీక్ డి డి ఎం తదితరులు పాల్గొన్నారు.